

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | : 18004251442 |
| యాదాద్రి | : 1800 425 7106 |
| సూర్యాపేట | : 1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.142 | 206 | 234 |
| సూర్యాపేట | రూ.150 | 220 | 250 |
| నల్లగొండ | రూ.149 | 216 | 246 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.8



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

# దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న మోదీ

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ముక్కలవుతుంది
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఒక్క అవకాశం ఇస్తే సమూల మార్పులు : తీన్మార్ మల్లన్న

**నల్లగొండ, మే 3:** మోదీ ప్రభుత్వం దేశ సంపదనంతా అంబానీ, అదానీలకు దోచి పెడుతోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న నామినేషన్ వేసిన సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్ జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ నడుస్తుందని మోదీ అంటున్నారని, అయితే నడిచేది దేశంలో అంబానీ, అదానీల ట్యాక్స్ అని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి పేదలకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని చెప్పి రూ.15 కూడా వేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా దోచుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పని ఈ నెల 13 తర్వాత ఖతం అవుతుందని, జూలై 4న ఆయన దుకాణం బంద్ అవుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న లక్ష ఓట్ల మెజార్టీతో మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలిపించాలన్నారు. జీవో 46తో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఆ జీవోపై కమిటీ వేసి రద్దు చేస్తామన్నారు. సంకీర్ణ ప్రభుత్వం వస్తే నామా నాగేశ్వర్‌రావు కేంద్ర మంత్రి అవుతారని కేసీఆర్ అనడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలవుతుందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఒక్క సీటు కూడా రాదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను లక్ష ఓట్ల మెజార్టీతో మొదటి ప్రాధాన్యం ఓట్లతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఒక అవకాశం ఇస్తే రాజకీయాల్లో సమూల మార్పులు తీసుకువస్తానన్నారు. గత పట్టభద్రుల ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో, అవినీతి సొమ్ముతో గెలిచారన్నారు.

గెలిచిన తరువాత నిరుద్యోగులను మోసం చేసి పారిపోవడంతో ఈ ఉప ఎన్నిక వచ్చిందని గుర్తు చేశారు. పట్టభద్రులంతా తనను మొదటి ప్రాధాన్యం ఓటుతో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రాములు నాయక్, కపిలవాయి దిలీప్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, అబ్బగోని రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డిలతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా నల్లగొండలో ర్యాలీ


# కాంగ్రెస్ మెడలు వంచాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- అభివృద్ధిపై జానారెడ్డి బహిరంగ చర్చకు రావాలి : జగదీశ్‌రెడ్డి

**నల్లగొండ, మే 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):** కేంద్రంలో చక్రం తిప్పాలన్నా, రాష్ట్రంలో కాంగ్రెస్ మెడలు వంచాలన్నా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, తెలంగాణలో బీఆర్ఎస్‌ను 12 సీట్లలో గెలిపిస్తే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకగా కేసీఆర్ పోరాడుతారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రం, చండూరులో బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్‌ను గెలిపించాలని నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా బాధ్యతతో ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని కేసీఆర్ నిలదీస్తే, ఆయనపై కనీస గౌరవం లేకుండా పేగులు మెడలో వేసుకుంటానని, గుడ్లుపీకి గోలీలాడుతానని అంటున్నారని, సీఎం మాట్లాడే భాష ఇలాగేనా ఉండేదని, దీన్ని సమాజం హర్షిస్తుందా అని ప్రశ్నించారు. మార్పంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏం మార్పు తెచ్చిందని అన్నారు. రైతుబంధు, 24గంటల విద్యుత్ నిలిపిందని, ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ఇదేనా మార్పంటే అని ప్రశ్నించారు.

### కుటుంబానికి రెండో నౌకరీ కోసం జానా ఆరాటం

కాంగ్రెస్ సర్కార్ వచ్చాక కొత్త ఉద్యోగం ఒక్కటీ రాలేదని, కానీ నల్లగొండలో కోమటిరెడ్డి కుటుంబానికి, ఉత్తమ్ కుటుంబానికి రెండు రెండు నౌకర్లు వచ్చాయన్నారు. ఇప్పుడు జానారెడ్డి కుటుంబానికి రెండో పదవి కోసం తాపత్రయపడుతున్నారని విమర్శించారు. రైతుబంధు కోసం కోమటిరెడ్డిని రైతులు అడిగితే చెప్పుతో కొడతానన్నారని, మంత్రి తుమ్మలను ప్రశ్నిస్తే తనకే పడలేదని తప్పుకున్నారని విమర్శించారు. ఉద్యమంలో ఒక్కరోజైనా జై తెలంగాణ అని రేవంత్‌రెడ్డి పలకలేదని, పైగా రైఫిల్ వేసుకొని రైఫిల్‌రెడ్డినని బెదిరించారని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లు పోతాయని బీజేపీపై దొంగవిమర్శలు చేస్తున్న సీఎం రేవంత్ ఆయన క్యాబినెట్‌లో ఒక్క ముస్లింను కూడా మంత్రిని చేయలేదన్నారు. అదే కేసీఆర్ క్యాబినెట్‌లో కీలకమైన హోంశాఖను మహమూద్‌అలీకి ఇచ్చారని, కేసీఆరే నిజమైన సెక్యులరిస్టని పేర్కొన్నారు. హిందువుల ఆస్తి ముస్లింలకు పంచుతారని బీజేపీ, రిజర్వేషన్లు రద్దుచేస్తారని కాంగ్రెస్, ఇలా ఒకరిపై ఒకరు దొంగడ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. కరోనా వంటి కష్టకాలంలోనూ కేసీఆర్ పాలనలో ఒక్క సీజన్‌లో కూడా రైతుబంధు ఆపలేదన్నారు. హామీలు అమలుచేయడం చేతగాక దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కయిందని ఆరోపిస్తున్నారని, నిజంగా కుమ్మక్కయితే కేసీఆర్ బిడ్డ కవిత జైలుకెందుకు వెళ్తుందని ప్రశ్నించారు. నల్లగొండ, సూర్యాపేటకు మెడికల్ కాలేజీలు తెచ్చామని, ఐటీహబ్ ఏర్పాటు చేశామని, నల్లగొండను నందనవనంగా తీర్చిదిద్దామన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడే చండూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశామన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే రూ.570కోట్ల నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే మంత్రి పదవి వస్తుందని ఆశతో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారని, ఆయనకు ఏ పదవీ రాదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్‌ను గెలిపిస్తే ప్రజల పక్షాన పోరాడుతారని హామీ ఇచ్చారు.



నల్లగొండ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు

### నల్లగొండ అభివృద్ధిపై జానా చర్చకు రావాలి : మంత్రి జగదీశ్‌రెడ్డి

మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఎవరు పాటుపడ్డారో, ఎవరి హయాంలో అభివృద్ధి ఎంత జరిగిందో బహిరంగ చర్చకు జానారెడ్డి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలాన్ని ఎండబెట్టి రైతులను ఇబ్బందులపాలు చేశారని దుయ్యబట్టారు. తమ హయాంలో 18 పంటలకు సాగునీరందించామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడు తూ, రైతుబిడ్డనైన తనకు పార్లమెంటుకు పోటీచేసే అవకాశం బీఆర్ఎస్ అధినేత కల్పించారని, తనను గెలిపిస్తే రైతుల పక్షాన పోరాడుతానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం దిగొస్తుందని అన్నారు. చండూరులో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ, తనను గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యేంత వరకు పోరాడతానన్నారు. అంతకుముందు నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పల్లె రవికుమార్ పాల్గొన్నారు.

# హైదరాబాద్-విజయవాడ మధ్య ర్యాపిడ్ రైలు

- పీసీసీ మ్యానిఫెస్టోలో ప్రాజెక్టు
- దీనికి కోసం పలుమార్లు కేంద్రాన్ని కోరిన మంత్రి ఉత్తమ్
- కేంద్రీయ, నవోదయ విద్యాలయాలకు హామీ
- స్థానిక సంస్థలకు నేరుగా కేంద్రం నిధులు



**నల్లగొండ, మే 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):** కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హైదరాబాద్-విజయవాడ మధ్య ఆధునిక ర్యాపిడ్ రైల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రదేశ్ కమిటీ (టీపీసీసీ) హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ ఇచ్చిన 'పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారంటీ'లకు అనుబంధంగా రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేయాల్సిన పథకాలపై పీసీసీ ప్రత్యేకంగా 23 అంశాలపై రూపొందించిన మ్యానిఫెస్టోను పీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు.

నల్లగొండ ఎంపీగా పనిచేసిన సమయంలో ప్రస్తుత రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ర్యాపిడ్ రైలు కోసం పలుమార్లు డిమాండ్ చేయడంతో పాటు, ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర మంత్రులను కలిసి విన్నవించారు. తాజాగా, పీసీసీ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే ఢిల్లీ-మీరట్ మధ్య ప్రస్తుత ఉన్న ర్యాపిడ్ రైల్వే వ్యవస్థ ఇక్కడ రానుంది. దీంతో ఈ మార్గంలో రైళ్లు గంటకు 160కిలోమీటర్ల వేగంతో నడుస్తాయి. రైల్వే స్టేషన్లల్లో ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా సేవలు, సదుపాయాలు అందుబాటులో వస్తాయి. కీలకమైన ఈ ప్రాజెక్టు దక్కితే ఈ మార్గంలో ఉండే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ-బీబీనగర్ వరకు అభివృద్ధికి ఆస్కారం ఉందని పలువురు భావిస్తున్నారు. దీంతోపాటు డ్రైపోర్టులను కూడా ఏర్పాటుచేస్తామని టీపీసీసీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కోదాడ, సూర్యాపేట, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ ప్రాంతాలు డ్రైపోర్టులకు అనువైనవని గతంలోనే ప్రభుత్వం గుర్తించింది.

### కేంద్రీయ, నవోదయ పాఠశాలల రెట్టింపునకు హామీ

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కేంద్రీయ పాఠశాలలు, నవోదయ పాఠశాలలను రెట్టింపు చేస్తామని పీసీసీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఒక నవోదయ పాఠశాలతో పాటు, నల్లగొండ, మిర్యాలగూడలో కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. భువనగిరి, సూర్యాపేటలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ల సాధనకు ఈ హామీలు తోడ్పడనున్నాయి. అదేవిధంగా రాష్ట్రంలో నాలుగు సైనిక్ స్కూళ్లను సైతం ఏర్పాటు చేయిస్తామనే కాంగ్రెస్ హామీ అమలైతే ఉమ్మడి జిల్లాకు ఒక సైనిక్ స్కూల్ దక్కే అవకాశముంది. దీంతోపాటు స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలకు నేరుగా కేంద్రం నుంచి నిధులను ఇస్తామని పీసీసీ ప్రకటించింది.



మామిడి కాయలను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి కళ్యాణచక్రవర్తి

# ఆరగించే ముందు జర భద్రం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం పండ్లు తీసుకుంటారు. అందులో వేసవిలో వీటి వినియోగం ఎక్కువ. ఇదే అదునుగా పండ్లను మాగబెట్టేందుకు వ్యాపారులు విచ్చలవిడిగా రసాయనాలను వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పండ్లు త్వరగా పక్వానికి వచ్చేలా కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది తెలియని ప్రజలు పండ్ల మాటున అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

\- కోదాడ

ఆరోగ్యానికి పండ్లు ఎంతో మేలు చేస్తాయి. ఉమ్మడి జిల్లాలో నిత్యం రూ.1.50కోట్ల పండ్ల వ్యాపారం సాగుతోంది. స్థానికంగా పండించే పండ్లతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి అధికంగా జిల్లాకు దిగుమతి అవుతున్నాయి. సాధారణంగా పండ్లను శీతల గిడ్డంగుల్లో ఇథలీన్ వాయువును పంపించి కృత్రిమంగా మాగబెడతారు. ఇది కొంతవరకు ప్రమాదం కాదు. కానీ, ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది. అయితే కొంతమంది వ్యాపారులు కాల్షియం కార్బైడ్‌తోపాటు, మరికొన్ని రసాయనాలను వినియోగించి పండ్లను మాగబెడుతున్నారు. విషతుల్యమైన ఈ పండ్లతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగించ కూడదని కోర్టులు సైతం హెచ్చరించినా వ్యాపారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా ఆహార పదార్థాలు, పండ్ల సహజ గుణాన్ని మార్చేలా వ్యవహరించే వ్యాపారులపై ప్రివెన్షన్ ఫుడ్ ఆడల్ట్రేషన్ యాక్ట్-1954ను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**విషతుల్య మవుతున్న పండ్లు**

అరటి, బొప్పాయి, సపోట, యాపిల్, ద్రాక్ష తదితర పండ్లలో కాల్షియం కార్బైడ్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. అరటికాయలను మాగబెట్టడంలో మొక్కల పెరుగుదలకు ఉపయోగించే ఎథిపాన్ ద్రావణాన్ని వాడుతున్నారు. ఈ ద్రావణంలో పండ్లు వేయగానే రంగుమారి మాగినట్లు కనిపిస్తాయి. అయితే వాటి తొడుగు వద్ద, కింద భాగంలో పచ్చగానే ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి అరటిపండ్లనే విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. యాపిల్ కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వ్యాక్స్ (మైనం) పూత పూస్తున్నారు. మామిడి కాయలను కార్బైడ్‌ను వినియోగించి మాగబెడుతున్నారు. ద్రాక్ష, సపోటాలను రసాయనాల సహాయంతో కృత్రిమంగా మగ్గిస్తున్నారు.

### పాత పద్ధతులకు పాతర

పండ్లను మాగబెట్టేందుకు సహజ పద్ధతులు ఉన్న, వీటిని వ్యాపారులు పాటించడంలేదు. గతంలో చెట్టుపైనే పక్వానికి వచ్చిన కాయలను కోసి మాగబెట్టేవారు. వాటిని సాంబ్రాణి, పీచు పొగతో సహజంగా మగ్గించేవారు. మామిడి పండ్లను వరిగడ్డి లేదంటే గొనేసంచుల్లో ఉంచి మగ్గించేవారు. ప్రస్తుతం వ్యాపార ధోరణిలో వచ్చిన మార్పులతో కాయలు పక్వానికి రాకముందే కోసి కృత్రిమంగా మాగేస్తున్నారు.



**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

పండ్లను మాగబెట్టేందుకు వినియోగించే రసాయనాల ద్వారా శరీరంలో ఇసిటిలీన్ అనే గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఇది రక్తప్రసరణ, శ్వాస, జీర్ణవ్యవస్థ, కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ ను దెబ్బతీస్తుంది. ఫలితంగా రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. రసాయనాల కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ పొరలాంటిది ఏర్పడుతుంది. దీంతో శ్వాస ఇబ్బంది అవుతుంది. ఇసిటిలీన్ గ్యాస్ ప్రభావంతో అజీర్ణం సమస్య వస్తుంది. కార్బైడ్ కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుం ది. హెపటైటిస్-బీ వచ్చే అవకాశం ఉంది. - డాక్టర్ బీవీఎస్.ప్రసాద్



**కార్బైడ్ వినియోగిస్తే కఠిన చర్యలు**

పండ్లను మాగబెట్టేందుకు కార్బైడ్‌ను వినియోగిస్తే కఠినచర్యలతోపాటు, రూ.2లక్షల జరిమానా విధిస్తాం. పండ్లను మగ్గబెట్టేందుకు ఏథిపాన్ (ఇథిలియాన్) గ్యాస్‌ను మాత్రమే వినియోగించాలి. అది కూడా 50మిల్లీగ్రాములు మాత్రమే వినియోగించాలి. ఎక్కడైనా పండ్లు లేదా, ఆహారం కల్తీ జరిగినట్టు అనిపిస్తే మా దృష్టికి తీసుకువస్తే కేసు నమోదు చేస్తాం.

\- కళ్యాణ చక్రవర్తి, వైద్యుడు, ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి

**గుర్తించడం ఇలా..**

- యాపిల్ పండ్లపై మైనం పూత తెల్లగా కన్పిస్తుంది.
- రసాయనాలు వాడిన ద్రాక్షపై తెల్లగా పేరుకుపోయినట్టుగా ఉంటుంది.
- అరటి పండ్లు పసుపుగా ఉంటాయి. తొక్క మాగినట్లు ఉంటుంది. లోపలి భాగం మాత్రం గట్టిగా ఉంటుంది.
- సపోటాలు కనిపించటానికి పండినట్లుగా ఉండి, తొక్క తీస్తే రాదు.

**విషతుల్యం చేస్తే చర్యలు ఇలా..**

- ఆహార పదార్థాలు, పండ్ల సహజ గుణాన్ని మార్చేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చట్టం చెబుతోంది.
- ప్రివెన్షన్ ఫుడ్ ఆడల్ట్రేషన్ యాక్ట్-1954 సెక్షన్-6, 7ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- సహజ సిద్ధమైన పండ్లను విషపూరితం చేయడం క్షమించరాని నేరం. మూడేళ్ల జైలు శిక్షతో పాటు అపరాధ రుసుం కూడా వసూలు చేస్తారు.
- 2006, ఆగస్టు 23న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలులోకి తెచ్చిన ఆహార రక్షణ ప్రమాణాల ప్రకారం పండ్ల పంపిణీదారులు, సరఫరాదారులు వారి వివరాలను పండ్లపై స్టిక్కర్ల రూపంలో ఉంచాలి.
- పండ్లపై క్రిమిసంహారక మందులను ప్రయోగిస్తే సెక్షన్-50 ప్రకారం రూ.1లక్ష నుంచి 5లక్షలవరకు జరిమానా విధిస్తారు.మళ్లీ అదే తప్పు చేస్తే సెక్షన్-64 ప్రకారం రెండింతలు జరిమానా విధిస్తారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

**సూర్యాపేటఅర్బన్, మే 3:** జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు, సమర్థవంగా నిర్వహించేందుకు సిబ్బందికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్ ఓటింగ్ సెంటర్, డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేసిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. అంతకుముందు నూతన మార్కెట్‌లోని స్ట్రాంగ్‌రూంను కలెక్టర్, ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి పరిశీలించి పోలింగ్ యంత్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి మాట్లాడారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రికి, ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించాలని, స్ట్రాంగ్ రూంల భద్రత, కౌంటింగ్ కేంద్రాల భద్రత నియమ నిబంధనల ప్రకారం ఆర్మ్‌డ్ సిబ్బందిని కేటాయించాలన్నారు. అంతకుముందు సెల్ఫీ కేంద్రంలో శుక్రవారం జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే సెల్ఫీ దిగారు.



కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్యరావు సూర్యవంశీ

**సూర్యాపేటఅర్బన్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల మూల సిద్ధాంతాలు ఒక్కటే
- పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్, మే 3:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులు పూర్తిచేస్తామని పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజకవర్గాలకు చెందిన సీపీఐ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ జిల్లా ప్రాజెక్టులపై పూర్తి నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మూల సిద్ధంతాలు ఒక్కటేనన్నారు. పేదలు, కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన 20మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి ఒక్కసీటు రాదన్నారు. ఎంపీ ఎన్నికల్లో 5లక్షల మెజార్టీతో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలవబోతున్నారన్నారు. కార్యక్రమంలో జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శి వర్గసభ్యులు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, సూర్యానారాయణ, బొమ్మగాని ప్రభాకర్, మల్లేశ్వరి, పద్మ, సాముల శివారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి ఉత్తమ్, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు.



హుజూర్‌నగర్‌లో సీపీఐ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, జానారెడ్డి, సీపీఐ నాయకులు

**మేళ్లచెర్వు:** ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 14 నుంచి 15 ఎంపీ స్థానాలు వస్తాయని, బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, నరాల కొండారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, ఉస్తెల సృజన, ఉస్తెల నారాయణ రెడ్డి, పటేపు సైదులు, పాల్గొన్నారు.

### అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలి

**చిలుకూరు:** పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, గన్నా చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు మేదరమెట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## 'పట్టభద్రుల' ఉప ఎన్నికకు ఐదు నామినేషన్లు

**నల్లగొండటౌన్, మే 3:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ (ఎమ్మెల్సీ) ఉపఎన్నిక స్థానానికి రెండో రోజైన శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్) రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి ఒక సెట్, చాలిక చంద్రశేఖర్ రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. అలయన్స్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఈడ శేషగిరిరావు, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సీహెచ్ మహేందర్ జీకి అందజేశారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**హుజూర్‌నగర్, మే 3:** అనుమానాస్పద స్థితిలో కేరళా వాసి మృతి చెందాడు.ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం కేరళ రాష్ట్ర త్రిసూర్ జిలాల మరతుంపతి గ్రామానికి చెందిన తానికల్ రాజు(45) స్థానిక పాతబస్టాండ్‌లో వంటమాస్టారుగా పనిచేస్తున్నాడు. రాజు శుక్రవారం ఉదయం జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లి స్నేహితులతో కలిసి మందు సేవించాడు. భోజన అనంతరం ఇంటికి వస్తుండగా జాన్‌పహాడ్‌లో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని ఆటోలో హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆస్పత్రిలో చేర్పగా అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా రాజు 20 ఏళ్ల క్రితం హుజూర్‌నగర్‌కు వచ్చి హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అవివాహితుడు కావడంతో మృతదేహాన్ని కేరళకు తరలిస్తున్నట్లు, హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

## తాటిచెట్లపై నుంచి పడి గీత కార్మికులకు తీవ్రగాయాలు

**భువనగిరి రూరల్, మే 3 :** తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొడిగ అంజయ్య కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కాళ్లు జారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

**మద్దిరాల, మే 3:** సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుక్కడంలో తాటి చెట్టు ఎక్కుతూ జారిపడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అక్కినపల్లి నాగయ్య శుక్రవారం గ్రామశివారులోని తాటి చెట్టు ఎక్కుతూ జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నాగయ్యకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

## వడదెబ్బతో ముగ్గురి మృతి


సర్వయ్య(ఫైల్)

**ఆత్మకూర్(ఎస్)/శాలిగౌరారం / భువనగిరి రూరల్:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వడదెబ్బకు ముగ్గురు మృతి చెందారు.సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన సంధ్యాల సర్వయ్య(83) ఎండవేడిమికి అస్వస్థతకు గురై గురువారం రాత్రి మృతి చెం దాడు. సర్వయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రానికి చెం దిన గుండ్లపల్లి వెంకన్న(55) వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతరానికి చెందిన ఎల్లం నర్సిరెడ్డి(65) ఎండతీవ్రతను తట్టుకోలేక మృత్యువాత పడ్డారు.

# వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ


యాదగిరిగుట్ట ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**భువనగిరి అర్బన్, మే 3:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి స్వర్ణపుష్పార్చన, ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని శ్రీరామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకారంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.31,99,066ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

# మునగాలలో నిప్పుల సెగలు

**యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేటటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి నల్లగొండ జిల్లా నిప్పుల కుంపటిగా మారగా ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు ఊపిరి ఆడనివ్వడం లేదు. ఉదయం ఏడు గంటల నుంచి మొదలవుతున్న ఉబ్బరింత, వేడిగాలులు రాత్రి 10గంటల వరకు తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపశమనం కోసం కూలర్లు ఏర్పాటు చేసుకున్నా, అందులో నుంచి వేడిగాలులే వస్తున్నాయంటున్నారు. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించాలని కోరుతూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో క్రైస్తవుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున ప్రజలకు ఉపశమనం కలిగించాలని, వర్షాలు కురిసేలా చూడాలని మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బతో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.

శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా త్రిపురారం మండలంలో 46.6 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 40.5 డిగ్రీలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.7 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 41.5 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో అత్యధికంగా 45.4 డిగ్రీలు, తుర్కపల్లిలో అత్యల్పంగా 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో రెడ్ అలర్ట్ జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు.


ఎండవేడిమికి నిర్మానుష్యంగా నల్లగొండలోని ప్రధాన రహదారి

# భూమి బదలాయింపుదారులపై చర్యలు తీసుకోవాలి

**మునుగోడు, మే 3:** మునుగోడు చేనేత సహకార సంఘం ఆధీనంలోని భూమిని బదలాయించుకున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చేనేతకార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలోని గిర్దావర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. మునుగోడులోని 78 సర్వే నెంబరులోని 10 గుంటల భూమిని చేనేత కార్మికుల పేరుతో కొత్త అసోసియేషన్ ఏర్పాటు చేసి భూమిని బదలాయించుకున్న విషయమై విచారణ చేపట్టాలన్నారు. అక్రమాలపై పాలకవర్గీన్ని ప్రశ్నించినా ఇన్నాళ్లు సమాధానాలు దాటవేస్తూ వస్తోందన్నారు. ఇన్నాళ్లుగా నమ్మిస్తూ రోజులు గడిపుతూ కాలయాపన చేస్తున్నారని అయినా నమ్మినా ప్రయోజనం లేకుండా పోయిందని చేనేత కార్మికులు ఆరోపించారు. ఈ అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భూమిని తమకు చెందేలా చూడాలని చేనేత కార్మిక సంఘం నేతలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెరుకు సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల అశోక్, పట్టణ అధ్యక్షుడు చిలుకూరి మధు, సామల యాదగిరి, కర్నాటి రాజు, సింగం కృష్ణయ్య, సత్యనారాయణ, శ్రీను, సురేష్, వెంకటేశం తదితరులు ఉన్నారు.


మునుగోడులో గిర్దావర్‌కు ఫిర్యాదును అందజేస్తున్న చేనేత కార్మికులు

# అసత్యాల ప్రచారానికి చెక్

● మిత్ వర్సెస్ రియాలిటీ పేరిట ప్రత్యేక వెబ్ పేజీ

● అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల సంఘం




మిత్ వర్సెస్ రియాలిటీ వెబ్ పేజీ

**భువనగిరి టౌన్, మే 3 :** ఎన్నికల వేళ అసత్య వార్తలు ప్రాచుర్యం పొందడం సర్వసాధారణం. అయితే అసత్య వార్తలు ప్రభుత్వ వ్యవస్థకు లేదా ఎవరికైనా ఇబ్బంది కలిగించనంత వరకు వాటితో ఎలాంటి ముప్పు ఉండదు. కానీ ఇటీవల సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న అసత్య ప్రచారానికి ఎన్నికల కమిషన్ కూడా స్పందించింది. పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో ఎన్నికల కమిషన్ పేరిట చేస్తున్న తప్పుడు పోస్టింగ్‌లతో పలువురు అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఎన్నికల కమిషన్ వాస్తవాలను ఓటర్లు ధ్రువీకరించుకునే అవకాశం కల్పించేందుకు ఇటీవల మిత్ వర్సెస్ రియాలిటీ పేరిట ప్రత్యేక వెబ్ పేజీని అందుబాటులోకి తెచ్చింది. భారతీయులందరూ తమ సెల్‌ఫోన్లలో ఎన్నికల సంఘం రూపొందించిన వెబ్ పేజీ https://mythvsreality.eci.gov.inని సందర్శించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చునని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్వర్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ పేర్కొంటున్నారు.

**ఎన్నికల కమిషన్‌ను ట్యాగ్ చేస్తూ జరిగిన అసత్య ప్రచారం**

లోకసభ ఎన్నికల్లో ఓటు వేయకుంటే మీ బ్యాంక్ ఖాతా నుంచి లేదా మొబైల్ రీచార్జ్ నుంచి రూ.350 ఎన్నికల కమిషనర్ కోత విధిస్తుందని ఇటీవల విస్తృతంగా ప్రచారం జరిగింది. అలాగే ఓటరు జాబితాలో పేరు లేనప్పటికీ పోలింగ్ కేంద్రానికి రెండు ఫొటోలతో వెళ్లి అక్కడికక్కడే ఫారం-8 నింపి ఓటు వేయవచ్చునని వైరల్ అయ్యాయి. కానీ అవన్నీ అసత్యాలేనని ఎన్నికల కమిషన్ మిత్ వర్సెస్ రియాలిటీ వెబ్ పేజీలో పేర్కొంది. అలాగే ఓటరు జాబితాలో పేరు లేదని గుర్తించినప్పుడు ఆధార్- ఓటరు కార్డు చూపించి సెక్షన్-49ఏ కింద ఛాలెంజ్ ఓటు అడిగి వేయవచ్చునని ప్రచారం జరగ్గా ఎన్నికల కమిషన్ మాత్రం ఓటరు జాబితాలో పేరు లేని వ్యక్తి ఎలాంటి గుర్తింపు కార్డులు చూపినప్పటికీ ఓటు వేయడానికి వీలు లేదని, ఓటరు జాబితాలో పేరున్న బూత్‌లోనే ఓటును వేయాల్సి ఉంటుందని వెబ్ పేజీలో స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లను నమ్మి అయోమయానికి గురి కాకుండా నివృత్తి కోసం వెబ్ పేజీని సందర్శించాలని ఎన్నికల కమిషన్ సూచిస్తోంది. అలాగే తమ అనుమానాలను కూడా వెబ్ పేజీ ద్వారా నివృత్తి చేసుకోవచ్చునని కూడా ఎన్నికల కమిషన్ సలహా ఇచ్చింది. ఇక ఇప్పటికైనా ఎన్నికల కమిషన్‌ను ఉటంకిస్తూ జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మకుండా అనుమానాల నివృత్తి కోసం వెబ్ పేజీని సందర్శిస్తే మంచిది.

## ఓటేశాక వెళ్లండి..ప్లీజ్

● ఓటర్లను కోరుతున్న అభ్యర్థులు



సెలవులంటేనే సరదా.. అందులో వేసవి సెలవులంటే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరింత ఉత్సాహమే. కుటుంబమంతా చల్లని ప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. ఇక నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు అమ్మమ్మ, నానమ్మ ఇంటికి వెళ్దామంటూ మారాం చేస్తుంటారు. నిత్యం బిజీగా ఉండే తల్లిదండ్రులు సైతం పిల్లల పేరుతో కాస్త సేదతీరేందుకు ఇదే సమయమని భావిస్తుంటారు. అయితే ఈ వేసవిలో మాత్రం టూర్లకు వెళ్ల వద్దంటూ ఓటర్లను వేడుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. ఈనెల 13న రాష్ట్రంలోని పార్లమెంట్ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల కారణంగా ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల రోజున ఎటూ వెళ్లొద్దంటూ ఓటర్లను కోరుతున్నారు. ఓటేశాక తీరిగ్గా వెళ్లండంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు.

● మిర్యాలగూడ టౌన్

## ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనం



ఎలాంటి రశీదులు లేకుండా ఎలక్ట్రానిక్ వస్తువులను తరలిస్తున్న వాహనం వద్ద పోలీసులు

**నార్కట్‌పల్లి, మే 3 :** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.23.25 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను నల్లగొండ జిల్లా పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి నల్లగొండకు టీఎస్-07యూఎన్-3758 నెంబరు గల డీసీఎం వ్యాన్ పరిశీలించారు. అందులో 103 ఏసీలు, రిఫ్రిజరేటర్లను గుర్తించారు. అయితే పరికరాలకు సంబంధించిన కొనుగోలు ఆధారాలను చూపించకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.23,25,430లుగా ఉందన్నారు. వస్తువులను తదుపరి చర్యల నిమిత్తం నల్లగొండ కమర్షియల్ టాక్స్ అధికారులకు అప్పగించామని ఎస్ఐ వెల్లడించారు.

**రూ.9.20లక్షల పట్టివేత**

ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న సుమారు రూ.9.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు.

# పార్లమెంట్‌కు మన ప్రతినిధులు వీరే

▸ 1952 నుంచి 2019 వరకు విజేతలు ▸ పీడీఎఫ్, సీపీఐ, తెలంగాణ ప్రజా సమితి, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్‌లకు అవకాశం





రావి నారాయణరెడ్డి(సీపీఐ), ధర్మభిక్షం(సీపీఎం), సురవరం సుధాకర్‌రెడ్డి(సీపీఎం)బీఎన్‌రెడ్డి(కాంగ్రెస్), జైపాల్‌రెడ్డి(కాంగ్రెస్)

**దేశంలో మొదటి లోక్‌సభ ఎన్నికలను 1951 అక్టోబరు నుంచి 1952 ఫిబ్రవరి వరకు నిర్వహించారు. 489 పార్లమెంట్ స్థానాలతో 1952 ఏప్రిల్ 17న మొదటి లోక్‌సభ కొలువుదీరింది. తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రమాణం చేశారు. ఆ నాటి నుంచి 2019 నాటి వరకు 17 పర్యాయాలు పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించారు. లోక్‌సభ స్థానాల పునర్విభజన, తర్వాత కలిపి నల్లగొండ ఎంపీ స్థానానికి 17 సార్లు, మిర్యాలగూడ స్థానానికి 12 సార్లు, భువనగిరి స్థానానికి 3 సార్లు ఎన్నికలు జరిగాయి. ఆయా స్థానాలకు పలువురు ప్రముఖులు ప్రాతినిధ్యం వహించారు.**

- చౌటుప్పల్ టౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటగా నల్లగొండ లోక్‌సభ స్థానాన్ని ద్విసభ విధానంలో ఏర్పాటుచేశారు. 1952లో నిర్వహించిన మొదటి ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఒకరు జనరల్ అభ్యర్థిగా రావి నారాయణరెడ్డి(పీడీఎఫ్), మరొకరు ఎస్సీ రిజర్వుడ్ అభ్యర్థి సుంకరి అచ్చాలు(పీడీఎఫ్)విజయం సాధించారు. 1957 ఎన్నికల నుంచి ద్విసభ్య విధానాన్ని రద్దు చేశారు. 1962లో నల్లగొండకు అదనంగా మిర్యాలగూడ పార్లమెంట్ స్థానాన్ని ఏర్పాటుచేశారు. 2008లో నిర్వహించిన డీలిమిటేషన్‌లో మిర్యాలగూడ స్థానాన్ని రద్దు చేసి భువనగిరి స్థానాన్ని కొత్తగా ఏర్పాటుచేశారు.

**పీడీఎఫ్ నుంచి బరిలో సీపీఐ నాయకులు**

నల్లగొండ ఎంపీ స్థానంలో రెండుసార్లు పీడీఎఫ్, ఐదు సార్లు సీపీఐ, ఏడు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు టీడీపీ, ఒక సారి తెలంగాణ ప్రజా సమితి పార్టీ విజయం సాధించాయి. తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిర్వహించిన సీపీఐని 1948లోని అప్పటి తాత్కాలిక ప్రభుత్వం నిషేధించింది. .దీంతో ఆ పార్టీ నాయకులు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ పేరుతో 1952, 1957లో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. ఆ తరువాత సీపీఐ మీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంతో అప్పటి నుంచి సీపీఐ పేరుతో పోటీచేస్తున్నారు. 1964లో సీపీఐ విధానాలను విభేదించి 1964 నవంబరు 7న సీపీఐ(మార్క్సిస్టు)గా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు.

**నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికైన సభ్యులు**

| సంవత్సరం | విజేత | పార్టీ |
|---|---|---|
| 1952 | రావి నారాయణ రెడ్డి | పీడీఫ్ |
| సుంకరి అచ్చాలు (రిజర్వుడు) పీడీఎఫ్ (ద్విసభ్యవిధానం) | | |
| 1957 | దేవులపల్లి వెంకటేశ్వరరావు | పీడీఎఫ్ |
| 1962 | రావి నారాయణరెడ్డి | సీపీఐ |
| 1967 | ఎండీ యూనస్ సలీం | కాంగ్రెస్ |
| 1971 | కె. రామకృష్ణారెడ్డి | తెలంగాణ ప్రజాసమితి |
| 1977 | అబ్దుల్ లతీఫ్ | కాంగ్రెస్ |
| 1980 | టీ దామోదర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 1984 | ఎం.రఘుమారెడ్డి | టీడీపీ |
| 1989 | చకిలం శ్రీనివాస్‌రావు | కాంగ్రెస్ |
| 1991 | ధర్మబిక్షం | సీపీఐ |
| 1996 | ధర్మబిక్షం | సీపీఐ |
| 1998 | సురవరం సుధాకర్‌రెడ్డి | సీపీఐ |
| 1999 | గుత్తా సుఖేందర్‌రెడ్డి | టీడీపీ |
| 2004 | సురవరం సుధాకర్‌రెడ్డి | సీపీఐ |
| 2009 | గుత్తా సుఖేందర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2014 | గుత్తా సుఖేందర్‌రెడి | కాంగ్రెస్ |
| 2019 | ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి | కాంగ్రెస్ |



**మిర్యాలగూడ స్థానం నుంచి ఎన్నికైన సభ్యులు (ఎంపీ)**

| | | |
|---|---|---|
| 1962 | లక్ష్మీదాస్ | సీపీఐ |
| 1967 | జీఎస్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1971 | బీంరెడ్డి నర్సింహారెడ్డి | సీపీఎం |
| 1977 | జీఎస్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1980 | జీఎస్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1984 | బీంరెడ్డి నర్సింహారెడ్డి | సీపీఎం |
| 1989 | బద్దం నర్సింహారెడ్డి | కాంగ్రెస్ |
| 1991 | బీంరెడ్డి నర్సింహారెడ్డి | సీపీఎం |
| 1996 | బద్దం నర్సింహారెడ్డి | కాంగ్రెస్ |
| 1998 | బద్దం నర్సింహారెడ్డి | కాంగ్రెస్ |
| 1999 | సూదిని జైపాల్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2004 | సూదిని జైపాల్‌రెడ్డి | కాంగ్రెస్ |

2008లో డీలిమిటేషన్‌లో మిర్యాలగూడ స్థానాన్ని రద్దు చేసి భువనగిరి లోక్‌సభ స్థానాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు.

**భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం**

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, వరంగల్ జిల్లాలోని జనగాం అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించారు.

| | | |
|---|---|---|
| 2009 | కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2014 | బూర నర్సయ్యగౌడ్ | టీఆర్ఎస్ |
| 2019 | కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి | కాంగ్రెస్ |

## రసవత్తరంగా టెన్నిస్ డబుల్స్ ఫైనల్స్




డబుల్స్ విన్నర్, రన్నర్ జట్లతో నిర్వాహకులు

**భువనగిరి టౌన్, మే 3 :** యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో జరుగుతున్న నేషనల్ అండర్-14 టెన్నిస్ సిరీస్‌లో డబుల్స్ పోరు ముగిసింది. ఫైనల్ మ్యాచ్ పోటాపోటీగా రసవత్తరంగా సాగింది. డబుల్స్ బాలుర ఫైనల్స్‌లో ఫజల్ అలీమీర్, అతర్వ శ్రీరామోజు జట్టు వంజి ఆర్యన్ పోతునూరి, లక్ష్య చుక్కా జట్టుపై 4-6, 6-3, 10-5 సెట్లతో గెలుపొంది నేషనల్ సిరీస్ బాలుర ఛాంపియన్‌గా నిలిచారు. బాలికల విభాగంలో శ్రీషితి కిరణ్, పద్మ రమేష్‌కుమార్ జట్టు శిభాణి, గుప్త, శ్రావి డోరె జంటపై 7-6, 6-1 సెట్లతో గెలుపొంది విజేతగా నిలిచారు. విన్నర్స్, రన్నర్స్‌కు యాదాద్రి టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సద్ది వెంకట్‌రెడ్డి, సయ్యద్ ఖలీం అహ్మద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ, సహాయకార్యదర్శి పరమేష్‌కుమార్ సింగ్, న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి, కోశాధికారి అతఉల్లాఖాన్ పాల్గొన్నారు.

**నేడు సింగిల్స్ ఫైనల్స్**

టెన్నిస్ సిరీస్ సింగిల్స్ ఫైనల్స్ శనివారం జరుగనున్నాయి. బాలుర ఫైనల్స్‌కు తెలంగాణకే చెందిన ఇరువురు అతర్వ శ్రీరామోజు, వంజి ఆర్యన్ పోతునూరి, బాలికల విభాగంలో మహారాష్ట్రకు చెందిన శిభాణి గుప్తా, కర్ణాటకకు చెందిన శ్రీషితి కిరణ్ తలపడనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో బాలుర విభాగంలో అతర్వ శ్రీరామోజు(తెలంగాణ) ఫజల్ అలీ మీర్ (తమిళనాడు)పై 6-3, 6-4 వరుస సెట్లలో విజయం సాధించారు. మరో సెమిఫైనల్స్‌లో వంజి ఆర్యన్ పోతునూరి (తెలంగాణ) సీడీ ప్రణీత్‌రెడ్డి (తెలంగాణ)పై 6-2, 6-2 వరుస సెట్‌లో విజయం సాధించాడు. బాలికల విభాగంలో శ్రీషితి కిరణ్(కర్ణాటక), దీప్తి వెంకటేశన్ (తమిళనాడు)పై 6-4, 60 పాయింట్ల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. మరో సెమీఫైనల్స్‌లో శిభాణి గుప్తా(మహారాష్ట్ర) శ్రావి డోరి(మహారాష్ట్ర)పై 6-4, 6-1 వరుస సెట్లలో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది.

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మిట్టపల్లి



మిట్టపల్లి వెంకటేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న టీపీవైసీ రాష్ట్ర కార్యదర్శి శివసేనారెడ్డి

**మిర్యాలగూడ టౌన్, మే 3 :** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మిట్టపల్లి వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు నియామకపత్రం అందజేసిన టీపీవైసీ రాష్ట్ర కార్యదర్శి శివసేనారెడ్డి, తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి తదితరులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా వెంకటేష్ నియామకంపై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఫీల్డ్‌అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలి

● ఎఫ్ఏ ఇంటి ముందు కూలీల నిరసన



ఫీల్డ్‌అసిస్టెంట్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

**చివ్వెంల, మే 3 :** ఉపాధి కల్పించకుండా ఇబ్బంది పెడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని కూలీలు ఆందోళన బాటపట్టారు. సూర్యాపేట బండ మీదిచందుపట్లలో శుక్రవారం 50 మందికి పైగా కూలీలు ఫీల్డ్‌అసిస్టెంట్ గుయ్యం రవి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 600 మందికి పైగా కూలీలు ఉన్న గ్రామంలో కావాలనే తనుకు అనుకూలంగా ఉన్న ముగ్గురు మేట్ల సహాయంతో నిత్యం ఉపాధి కల్పించిన వారికే పని కల్పిస్తూ మిగతా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. 300మందికి పైగా కూలీలకు ఉపాధి కల్పించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. తాను చెప్పిన రోజే పనికి రావాలని ఆదేశిస్తున్నాడని అన్నారు. నచ్చిన వారిని మేట్లుగా నియమించుకొని ఉపాధి పనికి రాకున్నా 50 మందికి నిత్యం హాజరు వేస్తూ వారి నుంచి కొంతనగదు తీసుకొని అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఉపాధి పనుల్లో ఫీల్డ్‌అసిస్టెంట్ చేసిన అవినీతిపై బహిరంగ విచారణ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి చలమయ్య, ఏపీవో నాగయ్య ఫీల్డ్‌అసిస్టెంట్ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీల వద్దకు వచ్చి వారికి నచ్చజెప్పి పనులకు వెళ్లాలని ఆదేశించారు. పని చేసిన వారికి హాజరు నమోదుచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 100 మందికి పైగా కూలీలు సుమారు గంటకు పైగా ఆందోళన చేశారు. అదేవిధంగా పనులు చేసే ప్రదేశాల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూలీలు మరోసారి ప్రశ్నించారు.

## డివైడర్‌ను ఢీకొని వాహనదారుడు మృతి

**కట్టంగూరు, మే 3 :** ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం డివైడర్ ఢీకొట్టగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన సోమపొంగు నాగేశ్వర్‌రావు(33) హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి కుమార్తె మనీషాతో బైక్‌పై బయలుదేరాడు. కట్టంగూరు శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టాడు. ప్రమాదంలో నాగేశ్వర్‌రావు తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె మనీషాకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగేశ్వర్‌రావు భార్య రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## అగ్నిప్రమాదం

**నాగారం, మే 3:** సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో విద్యుత్ మోటారు పైప లైన్ కాలిపోయాయి. శుక్రవారం వర్ధమానుకోట గ్రామంలోని రైతు ఆకుల నాగయ్య వ్యవసాయ క్షేత్రంలో మంటలు భారీగా వ్యాపించడంతో రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు.

# ఉపాధి కూలీలకు నీడ కరువు

● చెట్టునీడలో సేదతీరుతున్న కూలీలు

**రోహిణి కార్తెకు ముందు ఎండ దంచికొడుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినా ఆచరణలో కనిపించడం లేదు. పనిప్రదేశంలో కూలీలకు నిలువనీడ కరువైంది. నీడ సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. కేవలం చిన్నపాటి టెంట్‌లనే ఏర్పాటుచేసి కొంత మేరకు ఉపశమనం కల్పిస్తున్నా, అవి పూర్తిస్థాయిలో కూలీలు అందుబాటులో ఉండటంలేదు. మూడేళ్లుగా సామాగ్రి అందించకపోగా, కేవలం మెడికల్ కిట్లు, నీడ కోసం టెంట్లు అందించారు.**

● సూర్యాపేట సిటీ



పెన్‌పహాడ్ మండలంలో చెట్లనీడలో సేద తీరుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు పనుల వద్ద నీడ వసతితో పాటు అన్నిరకాలుగా భద్రత కల్పించాల్సి ఉంటుంది. అయితే గ్రామానికి రెండు లేదా మూడు కవర్లు(టెంట్లు) మాత్రమే అందించారు. ఒక్క గ్రామంలో కనీస 150 నుంచి 200 మందికి పైగా కూలీలు పనులు చేస్తున్నారు. అధికారులు పంపిణీ చేసిన కవర్లు(టెంట్లు) ఏ మాత్రం సరిపోవడం లేదు. జిల్లాలో 43 డీగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో పనిప్రదేశంలో ఇచ్చిన టెంట్లు సరిపోగా, కొన్నిచోట్ల ఆ టెంట్లు కూడా లేకపోవడంతో చెట్ల నీడే ఆధారం అవుతున్నాయి. అలసిన కూలీలు చెట్ల నీడన సేదతీరుతున్నారు. పనుల పర్యవేక్షణకు వచ్చిన అధికారులకు కూలీలు టెంట్లు కావాలని మొరపెట్టుకున్నా కార్యరూపం దాల్చడంలేదు. ఒక గ్రామంలో సంఘబంధాలు 50కి పైగా ఉండగా కేవలం రెండు, మూడు సంఘాలకే కవర్లు అందజేస్తున్నారు.

**కొలతలు తగ్గిస్తేనే కూలీకి గిట్టుబాటు**

వేసవిలో పనులకు వెళ్లే కూలీలకు మార్చి నుంచి జూన్ వరకు అదనపు చెల్లింపులు చేస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కూలీలకు పూర్తి స్థాయిలో పనులు చేయలేకపోతుండటంతో కూలి గిట్టుబాటు కావడంలేదని కూలీలు వాపోతున్నారు. ప్రతీ వేసవిలో మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా వేతనాలు చెల్లిస్తారు. వేసవిలో అదనపు చెల్లింపులతో పాటుగా కొలతలను కూడా తగ్గించాలని, వేసవిలో భూమిలో తేమశాతం లేక తవ్వకాలు ఇబ్బందిగా ఉంటాయని కూలీలు వాపోతున్నారు.

**ఉపాధి పథకం తీరు**

సూర్యాపేట జిల్లాలో ఉపాధిహామీ పథకం కోసం నమోదు చేసుకున్న కూలీల సంఖ్య 5,68,363 మంది కాగా అధికారులు జిల్లావ్యాప్తంగా 2,61,363 జాబ్‌కార్డులను పంపిణీ చేశారు. కాగా 1,79,285 జాబ్‌కార్డులతో 3,35,278 మంది కూలీలు పనులకు హాజరు అవుతున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.

**సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం**

ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, పనిచేసిన తర్వాత సేద తీరేందుకు టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశంలో ఖచ్చితంగా టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

● మధుసూదనరాజు, డీఆర్‌డీవో పీడీ



20 మంది కూలీలకు కూడా సరిపోని తాత్కాలిక టెంట్



భువనగిరి చెరువులో ఉపశమనం పొందుతున్న గొర్రెలు

## వేసవి నుంచి జీవాల ఉపశమనం

యాదాద్రి భువనగిరి జిల్లాలో 45.5 డిగ్రీల ఎండలు మండిపోతున్నాయి. ఈ వేసవి వేడిమికి మనుషులే కాక మూగజీవులు కూడా విలవిలలాడుతున్నాయి. వడగాడ్పుల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా కేంద్రం భువనగిరి సమీపంలోని చెరువులో గొర్రెలు నీళ్లలో ఉపశమనం పొందడం కెమెరాకు చిక్కింది. గొర్రెల కాపరులు మధ్యాహ్న సమయంలో నీటి కోసం చెరువు వద్దకు తీసుకెళ్లగా దాహం తీర్చుకున్న గొర్రెలు మండుతున్న ఎండలకు, ఉక్కపోత నుంచి బయటపడేందుకు నీళ్లల్లో కొద్దిసేపు సేదతీరుతూ కనిపించాయి.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్/-యాదాద్రి

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన

**భువనగిరి రూరల్, మే 3:** ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను డీపీవో మందడి ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగుతోంది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ధరణి కోట భగత్, కోట్ల కల్యాణ్, సిద్ధార్థరెడ్డి, ప్రణయ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జే భద్రయ్య, సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

# కేసీఆర్ ప్రచారం అడ్డుకోవడానికి కాంగ్రెస్ కుట్ర

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ్‌శ్‌రెడ్డి**



తుంగతుర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ్‌శ్‌రెడ్డి, పక్కన అభ్యర్థి క్యామ మల్లేష్

**తుంగతుర్తి, పెన్‌పహాడ్, మే 3:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతుందనే దురుద్దేశంతోనే కేసీఆర్ ప్రచారానికి నిషేధం విధించేలా కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ్‌శ్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం తుంగతుర్తి లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రారంభించిన బస్సు యాత్రతో రేవంత్‌రెడ్డికి వణుకు మొదలైందని అన్నారు.కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు లోపాయకారీ ఒప్పందంతోనే కొన్ని సీట్లలో పోటీ చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిలు పక్కదారి పట్టిస్తున్నారని, ప్రజల పక్షాన నిలబడేది సీఎం కేసీఆర్ మాత్రమే నని అన్నారు. సమావేశంలో భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీ‌ప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

**ప్రజల సమస్యలు వింటుంటే బాధగా ఉంది**

ప్రజల సమస్యలు వింటుంటే బాధగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్‌లో మాజీ సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆ గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో జగదీ‌శ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేస్తా మని కాంగ్రెస్ హామీ ఇచ్చి, నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. సాగు నీరు ఇవ్వనందున చెరువులు ఎడారులుగా మారి వ్యవసాయ భూములు బీళ్లుగా మారాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సారెస్పీ, సాగర్ ఎడమ కాల్వ, మిషన్‌భగీరథ ద్వారా సాగు, తాగు నీరు అందజేసి ఆదుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులుగా ఉండి సాగు, తాగు నీరు అందించలేకపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 16పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సూర్యాపేట నియోజకవర్గ ప్రచార కోఆర్డినేటర్ రామచంద్రునాయక్, నాయకులు భిక్షం, యుగేందర్, ఇంద్రసేనరావు, మురళి, జడ వీరయ్య, మల్లేపల్లి రామయ్య, దొంగరి భద్రయ్య, సైదయ్య, నాగయ్య పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి



సూర్యాపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి సతీమణి సునీత

**సూర్యాపేట(కలెక్టరేట్), మే 3:** కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని 35, 38వార్డులతో పాటు పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ మభ్యపెట్టి ప్రజలను మోసం చేసిందన్నారు. 'కల్యాణలక్ష్మి' ద్వారా వధువులకు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను నమ్మొద్దని, బీజేపీ మాయలో పడొద్దని సూచించారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ శ్రీరామ రక్ష అని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అమలుచేయలేని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పనై పోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్‌కుమార్, నాయకులు అంగిరేకుల నాగార్జున, కక్కిరేణి నాగయ్య, తాహెర్ పాషా, మొరిశెట్టి శ్రీనివాస్, ఆకుల లవకుశ, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, వల్దాస్ జాని, వల్దాస్ ఉపేందర్, బత్తుల జాని పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన హోంగార్డులు

**మునగాల రూరల్, మే 3:** హోంగార్డులు మానవత్వం చాటారు. శుక్రవారం మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తికి గుండు చేయించి, దుస్తులు అందించి మానవత్వం ప్రదర్శించారు. ఎండల తీవ్రతకు ఆ వ్యక్తి పడుతున్న బాధను చూసి చలించి సాయం అందించినట్లు హోంగార్డులు శ్రీనివాస్, ఈశ్వర్‌లు తెలిపారు.

## తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జిగా ఫర్హీన్ కౌసర్



జడ్జి ఫర్హీన్ కౌసర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

**తుంగతుర్తి, మే 3:** తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జిగా ఫర్హీన్ కౌసర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో విధులు నిర్వహిస్తూ బదిలీపై తుంగతుర్తికి వచ్చారు. పర్హీన్ కౌసర్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రమావత్ పుల్‌సింగ్‌నాయక్, మల్లపాక రవికుమార్, బానోత్ ప్రతాప్, వంగాల నాగరాజు, అనిల్‌కుమార్, న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, కారింగుల వెంకటేశ్వర్లు, కుంభం రణధీర్, హరిచరణ్, జీలకర చంద్రమౌళి, బానోత్ సతీష్, రాజారాం పులిచెర్ల శ్రీనివాస్, ఓర్సు రాజు, నక్కల సురేందర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.శ్రీలత, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండలంలో మంత్రి ఉత్తమ్ పర్యటన

**మఠంపల్లి, మే 3:** నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ మఠంపల్లి మండల కేంద్రంలో భారీ నీటి పారుదల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజూనాయక్, ఆదూరి కిషోర్‌రెడ్డి తెలిపారు. మఠంపల్లిలో జరిగే బహిరంగ సభ, రోడ్డు షోలో మంత్రితో పాటు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి హాజరవుతారని, ఈ కార్యక్రమాల్లో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'సీఎం వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండించాలి'

**నూతన్‌కల్, మద్దిరాల, మే3** మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో, మద్దిరాల మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివిధాలుగా లబ్ధిపొందిన నాయకులు నేడు పార్టీని వీడుతున్నారని, వారికి ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. ముందుగా నూతనకల్, మద్దిరాల మండలాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేందర్‌రావు, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మున్న మల్లయ్య యాదవ్, బత్తుల సాయిల్ గౌడ్, చూడి లింగారెడ్డి, జి.లింగరాజు, పసునూటి అయోధ్య, బత్తుల విద్యాసాగర్, బత్తుల సాగర్, ఎస్ఏ రజాక్, శ్రీరాంరెడ్డి, మల్లు కపోతంరెడ్డి, రవీందర్‌రావు, కోడి శ్రీనివాస్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మారెల్లి యాకయ్య పాల్గొన్నారు.

## 'ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం'

**సూర్యాపేట టౌన్, మే 3:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డుతో పాటు పలు వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మృతి

**కోదాడ రూరల్, మే 3:** మండలంలోని దొరకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పొందూరి బాబురావు(74) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. బాబురావు మృతదేహానికి ఎమ్మెల్యే పద్మావతి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబూరావు కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు సురేష్, రేవూరి వెంకటాచారి, హనుమంతరావు, నరేందర్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**తిరుమలగిరి రూరల్, మే 3:** విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొండ గ్రామానికి చెందిన సూదగాని అంజయ్య ఎద్దులు గురువారం సాయంత్రం గ్రామ శివారులో మేత మేస్తూ, నిమ్మల వీరసోములు బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.70వేల విలువైన ఎద్దు మృతి చెందిందని, అరకకు మరొక ఎద్దు లేక వ్యవసాయం ఆగిపోతుందని ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు అంజయ్య కోరాడు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం



కోదాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

**కోదాడ, మే 3:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి శుక్రవారం తెల్లవారుజాము నుంచి కోదాడ పట్టణంలో ప్రచారం చేశారు. కటకమ్మగూడెం రోడ్డులో మార్నింగ్ వాక్ చేసేవారిని, బాలుర హైస్కూల్ క్రీడాకారులను, హుజూర్‌నగర్ రోడ్డులోని టీస్టాల్ వద్ద ఓటర్లతో కలిసి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. టీ స్టాల్‌లో ఎమ్మెల్యే పద్మావతి, అభ్యర్థి రఘువీర్‌రెడ్డి టీ తాగి, బాగుందని నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే ఐదింటిని అమలు చేశామన్నారు. ప్రచారంలో పీసీసీ సభ్యుడు సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వంగవీటి రామారావు, సంపెట రవి, డాక్టర్ ఏటుకూరి రామారావు, వి.శ్రీనివాసరావు, సుందరి వెంకటేశ్వర్లు, గంధం యాదగిరి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు**

**చిలుకూరు:** మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మహాకూటమి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్‌కు చెందిన తిపిరిశెట్టి బసవయ్య, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, పుష్ప, అంజమ్మ, చిట్టెమ్మల ఆధ్వర్యంలో పలువురు చేరగా, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జానకి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకుడు వేమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: సామేలు



కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులుకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

**తుంగతుర్తి, అర్వపల్లి, మే 3:** కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం తిరుమలగిరి లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్, తుంగతుర్తి సింగిల్‌విండో చైర్మన్ గుడిపాటి సైదులు, బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ సభ్యురాలు దాయం ఝాన్సీరెడ్డి సామేలు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పీసీసీ సభ్యుడు గుడిపాటి నరసయ్య, తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్దన్, తిరుమలప్రగడ కిషన్‌రావు, కృష్ణమూర్తి, పెద్దబోయిన అజయ్ పాల్గొన్నారు.

**ఆరు గ్యారెంటీలను అమలుచేస్తాం**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం రాత్రి అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. . వారికి ఎమ్మెల్యే సామేలు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించేవారికే ప్రజాదరణ ఉంటుందన్నారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు ఇందుర్తి వెంకట్‌రెడ్డి, జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, ఉప్పలయ్య, కందుల తిరుమలరావు, రత్నం లక్ష్మాజీ, వెంకటనర్సు, బొడ్డు వెంకన్న, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, ఈదూనూరి సంతోష్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

**సూర్యాపేట అర్బన్, మే 3:** కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డిపై చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రా నాయకుల పాలనలో తెలంగాణకు విద్య, వైద్య రంగంలో నిధులు ఇవ్వకుండా నాశనం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమం ద్వారా ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్‌కు, కుడి భుజంగా ఉన్న జగదీ‌శ్‌రెడ్డి, జిల్లాకు రూ.8వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారన్నారు. సూర్యాపేటను జిల్లా కేంద్రంగా మార్చడమే కాకుండా మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రహదారుల విస్తరణ, సద్దుల చెరువు సుందరీకరణ, బోటింగ్ ఏర్పాటు చేసిన ఘనత జగదీ‌శ్‌రెడ్డికే దక్కిందన్నారు. తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలకు కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను అందించి రైతుల కళ్లల్లో ఆనందాన్ని బీఆర్ఎస్ పార్టీ తెచ్చిందన్నారు కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టకిశోర్, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బూర బాలసైదులుగౌడ్, బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు తొలగిస్తుందంటూ కాంగ్రెస్ అసత్య ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

**సూర్యాపేట సిటీ, మే 3:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తుందంటూ కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ సూర్యాపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి మురగన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లను తొలగించేదిలేదని ఇప్పటికే ప్రధాని మోదీ స్పష్టం చేశారన్నారు. నల్గొండ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, కోఆర్డినేటర్లు సుభాష్ చందర్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పార్లమెంటు కోకన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పొలగాని ధనుంజయ్‌గౌడ్, చల్లమళ్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత**

**తిరుమలగిరి:** బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, మాదిగల కలలను నేరవేర్చుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య తెలిపారు. శుక్రవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో తుంగతుర్తి నియోజకవర్గస్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యమన్నారు. మాదిగలంతా ఏకమై బీజేపీని గెలిపించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్కసీటు కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు మాదిగలమంతా సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో పాల్వాయి బాలయ్య, దీన్‌దయాల్, కందుకూరి శ్రీను, పాల్వాయి పరశురాములు, కొండగడపల శ్రీను, మధు, ఎర్ర రాములు, అల్లయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

**కోదాడ రూరల్, మే 3:** మండలంలోని కొమరబండ గ్రామంలో శుక్రవారం కంఠమహేశ్వరస్వామి, సూరమాంబదేవి ఆలయంలో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలు, యువతులు జలబిందెలతో ఊరేగింపుగా నృత్యం చేస్తూ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. రెండో రోజు శనివారం స్వామివారి కల్యాణం, ఆదివారం మొక్కు, ముస్తాదులతో పలు పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్, కులపెద్ద సంపెట రామయ్య, ఉపేందర్, సీతయ్య, వేముల వీరబాబు, ఎరగాని చందర్‌రావు, పంతంగి సత్యం, బండారు విజయ్, అనంతు సత్యం, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

## సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణం

**మఠంపల్లి, మే 3:** మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు గరుడోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు కృషి

**కోదాడ టౌన్, మే 3:** రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు నిరంతరం కృషి చేస్తున్నాయని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పీఏసీఎస్‌లో పంట రుణం తీసుకున్న కోదాడ మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన వట్టికూటి శ్రీను ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందాడు. శ్రీను రుణం తీసుకున్న సమయంలో బీమా ఉండటంతో సహకారం సంఘం నుంచి ఆయన కుటుంబానికి రూ.లక్ష చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం కోదాడలోని పీఏసీఎస్ కార్యాలయంలో శ్రీను భార్య ఉపేంద్రకు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్ ప్రభాకర్ రావు, జాబిశెట్టి చంద్రమౌళి. సీఈవో మంద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి: సీపీఎం

**మఠంపల్లి, మే 3:** ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యపాండునాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం సంపన్నులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ప్రకటించి పేదలపై ధరల భారం మోపిందని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపిందని ఆరోపించారు. సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నందున, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, రన్‌మియా, కోటయ్య, రాము శంభయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



'ఉపాధి' కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న స్వప్న

**సూర్యాపేట రూరల్, మే 3:** వడదెబ్బ తగలకుండా 'ఉపాధి' కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి సుష్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కేసారం గ్రామంలో 'ఉపాధి' కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి మాట్లాడారు. పనులకు వెళ్లే సమయంలో తలకు రుమాలు, టోపీ ధరించాలన్నారు. వడదెబ్బతగిలినవారిని నీడలోకి తీసుకువెళ్లి ఓఆర్ఎస్ ద్రావణం తాగించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలన్నారు. ఉదయం 10గంటల లోపే 'ఉపాధి' పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రదీప్, ఏఎన్ఎం ఉపేంద్ర, ఆశా కార్యకర్తలు మేరమ్మ, రాజేశ్వరి, సైదమ్మ పాల్గొన్నారు.

## పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

**పెన్‌పహాడ్, మే 3:** పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డీఎస్పీ జి.రవి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పెన్‌పహాడ్ మండలం నాగులపాటిఅన్నారం గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 15బైకులను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి బానిసలు, విక్రేతలపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక శక్తులపై పోలీసు నిఘా పెట్టామన్నారు. కార్డన్‌సెర్చ్‌లో సూర్యాపేట రూరల్ సీఐ వై.సురేందర్ రెడ్డి, పెన్‌పహాడ్ ఎస్ఐ పెరిక రవీందర్, ఎస్ఐలు మహేందర్, లింగయ్య, బాలు, వెంకట్‌రెడ్డి, సైదులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

## 'ఉద్యోగాలు ఇస్తానని మోసంచేసిన బీజేపీ'

**సూర్యాపేట సిటీ, మే 3:** ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ మోసం చేసిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'పార్లమెంటు ఎన్నికలు- కార్మికుల కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులపై దాడి జరిగిందన్నారు. పోరాడి సాధించుకున్న 44చట్టాల్లో 29చట్టాలను బీజేపీ రద్దు చేసి నాలుగు కోడ్లను తీసుకువచ్చిందన్నారు. ఈ కోడ్‌లను కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చిందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు చెందిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి కార్మికులు బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, యల్క సోమన్న, చెరుకు యాకలక్ష్మి, ఎం శేఖర్, శ్రీలం శ్రీను, ముత్యాలు, సాయికుమార్ పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి'

**కోదాడ రూరల్, మే 3:** నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుతూమాటి వరప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కూచిపూడి, కూచిపూడితండా, తొగర్రాయి, అడ్లూరు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేసిందన్నారు. ఆగస్టు 15వ తేదీన నాటికి రూ.2 లక్షల రుణమాఫీ కూడా అమలుచేస్తుందని అన్నారు. గ్రామసభల్లో ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గురవమ్మ పాల్గొన్నారు.